''మీరు మీరే – మేము మేమే'' అన్నా డాయన.

''అంతే – అంతే !'' అంగీకరించా రంతా ఏక కంఠంతో

* * *

చదరంగంలో ఎత్తులు మారాయి

''మీరూ మేమూ అంతా ఒక్కటే!'' అన్నాడు అదే ఆయన అదే కంఠంతో, వాళ్లతోటే

''అంతే-అంతే !'' తలలు వూపారు అందరూ, అంగీకార సూచకంగా

* * *

అనగా అనగా ఒక వూళ్లో ఒక విమానాశ్రయం వుంది అది మామూలు విమానాశ్రయం కాదు – మిలటరీవాళ్లు అవసరమైనప్పుడు హఠాత్తుగా దిగటానికి వీలుగా కట్టుకున్న విమానాశ్రయం

ఒకసారి నిజంగానే అత్యవసర పరిస్థితి వచ్చింది ఎయిర్ మార్షల్‌గారు ఒక చిన్న స్పెషల్ విమానంలో – ఆ వూళ్లో దిగటానికని హఠాత్తుగా వస్తున్నారు క్రింద వున్న గ్రౌండు ఆఫీసర్‌గారు—ఆయనా మిలటరీవాడే (ఆయన రేంకు నాకూ తెలీదు) – ఎయిర్ మార్షల్‌గారిని రిసీవ్ చేసుకోటానికి వైర్‌లెస్ సందేశం అందగానే పరుగెత్తుకుంటూ వచ్చాడు

విమానాశ్రయాన్ని చూసి, ఒక్కసారి గుండె ఆగినంతపనయి, ఆయన ఆగిపోయాడు

కారణం మరేమీ లేదు విమానాశ్రయంలోని రన్‌వే నిండా గొర్రెల మందలు అడ్డంగా వున్నాయి ఆ విమానాశ్రయం ఎక్కువగా వాడరు కనుక – తగిన జాగ్రత్తలు తీసుకోవటం లేదు మరి

రన్‌వే మీద అక్కడ కూడా వున్న గడ్డిని, రన్‌వే ప్రక్కనే దుబ్బుగా పెరిగిన గడ్డినీ తాపీగా మేస్తున్నాయి ఆ గొర్రెలు అగొర్రెలు ఎన్ని ఉన్నాయో కాని, ''రన్‌వే'' మాత్రం దాదాపు కనబడటంలేదు

గ్రౌండు ఆఫీసర్‌గారు తలమీద టోపీతీసి – పీక్కుందామంటే తలమీద జుట్టు లేదుకనుక – గుండు గోక్కున్నాడు

ప్రక్కనే చెట్టుమీద వున్న ఆడకాకితో మగకాకి ''ఆ తమాషా చూడు !'' అన్నది

ఆడకాకి భయంభయంగా ''హూష్ కాకీ – తెలుగులో పెద్దగా మాట్లాడకు – మనం తెలుగు వాళ్లం అని తెలిస్తే – జై ఆంధ్రా బాపతు అంటో శన కారులం అనుకుంటారు'' అన్నది

రెండు తెలుగు కాకులూ నోళ్లు మూసుకుని— తమాషా చూస్తున్నాయి

'గ్రౌండు ఆఫీసర్'గారి ఆజ్ఞ ప్రకారం యిరవైమంది, గొర్రెలను బయటకు తోలేపని




ప్రారంభించారు అవి అటూ, యిటూ పరుగెత్తి, పరుగెత్తి చివరకు రన్‌వే దాటి మాత్రం బయటకు రావటంలేదు పదినిముషాల్లో ఆ యిరవై మందికీ చెమటలుపట్టినయి కాళ్లనొప్పులు పుట్టినయి శోష వచ్చింది కానీ గొర్రెలు మాత్రం రన్‌వే దాటి బయటకు రాలేదు

మగకాకి ''భలే ! భలే !'' అంది

ఆడకాకి ''తెలుగులో అరవొద్దని చెప్పానా !'' కసిరింది

తెలుగు కాకులకు కూడా తెలుగులో అరవటానికి భయం, నామర్దా

ఈసారి నాలుగు ఫైరింజన్లు తెప్పించి గొర్రెలమీద బాగా నీళ్లు కొట్టించాడు ఆఫీసర్ గొర్రెల బొచ్చు తడిసిందికానీ, అవి మాత్రం కదలలేదు సరికదా – ఏమీ పట్టనట్టు వాటిపని అవి చేసుకు పోతున్నాయి

ఈలోపల ఎయిర్ మార్షల్‌గారి విమానం వచ్చేసింది దిగటానికి చోటులేక, పైనే అలా, అలా తిరుగుతున్నది–

గ్రౌండు ఆఫీసర్‌గారు గొర్రెల చుట్టూతా, మీదా, తుపాకులు పేల్పించాడు ఆ హడావిడికి అటూ యిటూ చెల్లాచెదరైనవికానీ, బయటకు మాత్రం పోలేదు కొన్ని మరీ చిన్నవీ, అమాయకమైనవీ – ఆ కాల్పులకు ప్రాణాలు కూడా కోల్పోయాయి

ఎయిర్ మార్షల్‌గారు, వైర్‌లెస్‌లో – క్రింద ఆఫీసర్‌ని నానా చివాట్లూ పెట్టాడు ప్రమోషన్ లిస్టులో వున్న నువ్వు, యిలా చేస్తే ఎలా? అన్నాడు నీకు పదవులు (ప్రమోషన్) అక్కరలేదా? అన్నాడు వెంటనే ఈ సమస్యని పరిష్కరిస్తేనే నీకు పట్టాభిషేకం ఉన్నాడు కోపం తెచ్చుకున్నాడు

గ్రౌండు ఆఫీసర్ ముఖం ఎర్రబడింది ఆ ఎర్రదనంలోనే చక్కటి ఆలోచనకూడా వచ్చింది చమటకు తడిసిన చొక్కాను సర్దుకున్నాడు జీపులోంచి దిగాడు గొర్రెలను తరుముతూ విఫల ప్రయత్నం చేస్తున్న అయిదారు జీపులను వెనక్కి పిలిపించాడు

ఒక్కడే గొర్రెల మందవేపు నడిచాడు

అందరూ ఏం జరుగుతుందా అని చూస్తున్నారు

ఆడకాకి మెడమీద బొచ్చు నిటారుగా నించుని వుండటం చూసి, దాని భయం తీర్చటంకోసం మగకాకి ఆడ కాకిని దగ్గరకు తీసుకుంది

ఆయన అలానే నడుస్తూ గొర్రెలమంద మధ్యకు వెళ్లాడు

''ఎందుకు వూపిరి పీల్చటం ఆపేస్తావు – నే వున్నాగా – నీకేం –'' మగ కాకి అంటున్నది.

''హూష్ – మళ్లీ తెలుగులో '' ఆడ కాకి భయపడ్డది

ఆయన చేతిలోకి కొంచెం పచ్చగడ్డి తీసుకున్నాడు ఒక గొర్రెముందు కూర్చుని దానికి కొంచెం గడ్డి పెట్టాడు నెమ్మదిగా దాన్ని దువ్వాడు. దాన్ని నడిపించుకుంటూ, దాని ప్రక్కనే హుందాగా నడవటం మొదలుపెట్టాడు ఆ గొర్రె వెంటనే కొన్ని గొర్రెలు బయల్దేరాయి వాటి వెంట మరి కొన్ని, తర్వాత మరికొన్ని – ముందు ఆయన ఆ గొర్రెతో నడుస్తున్నాడు వెనక మిగతా గొర్రెలన్నీ వస్తున్నాయి

అలా అలా నడిపించుకుంటూ విమానాశ్రయం బయటకు వెళ్లాడు ఆ గొర్రెలు కూడా అన్నీ బయటకు వెళ్లాయి.

ఎయిర్ మార్షల్ చిరునవ్వు నవ్వాడు

విమానం భూమి మీద దిగింది.

''భలే ! భలే'' అన్నది మగకాకి చప్పట్లు కొడుతూ...

''అరె – మళ్లీ తెలుగులో .'' కోప్పడింది ఆడ కాకి

''సారీ !'' అన్నది మగకాకి, ఈసారి ఇంగ్లీష్‌లో

* * *

విమానం దిగాక యింకేముంది కోటలో పాగాయేగా !!